


# మనసు

ఆదివిష్ణు

శంకరం తలవంచుకు కూర్చుని మాస్టారు చెప్పే ప్రతి మాటనీ ఆలకిస్తున్నాడు. మాస్టారు ఆరోజు చాలాసేపు మాట్లాడారు.

"ఇది లోకం నాయనా! నీవు చేసే ప్రతిపనికీ తోకలాగా కువిమర్శలు ఉంటాయి. నీవు లోకాన్ని ఖాతరు చెయ్యకపోవచ్చు. నిన్ను మాత్రం అనుక్షణం పరీక్షిస్తుంది లోకం. చిన్నవాడివి; తెలుసుకోవలసిన విషయాలు యింకా చాలా ఉన్నాయనే సంగతి మరచిపోకు."

శంకరం ఆయన కళ్ళలోకి సూటిగా చూశాడు. ఏదో చెప్పబోయి ఆగిపోయాడు. మళ్ళీ తల దించుకున్నాడు.

"నువ్వేదో చెప్పాలనుకుంటున్నావు. చెప్పు నాయనా! ఏమీ దాచుకోవద్దు."

ఈ మాటతో శంకరానికి ధైర్యంవచ్చింది.

"నాన్న మినహా నాకు మరో లోకంలేదు. ఆయన నా మాటకెప్పుడూ అడ్డుచెప్పరు. ఆ విషయం నాకు బాగా తెలును మాస్టారూ!"

మాస్టారు నవ్వారు. శంకరానికి ఆయ నలా నవ్వడం బొత్తిగా రుచించలేదు కాబోలు—మళ్ళీ చివాలున తలవంచుకున్నాడు.

"చూడు శంకరం! పిల్లలమాట కాదని వాళ్ళని నొప్పించాలనే ఉద్దేశ్యం ఏ తండ్రికీ ఉండదు. కాని పిల్లల శ్రేయస్సు నిమిత్తం వాళ్ళు తయారుచేసుకున్న పథకాలు తల్లక్రిందు లవడం సహించలేరు. నీ గురించి, నీ భవిష్యత్తుగురించి ఆయన ఆలోచనలు మరో విధంగా ఉండవచ్చునుగదా."

"మా నాన్న గురించి నాకు తెలుసు."

మాస్టారు ఏమీ మాట్లాడలేకపోయారు. మళ్ళీ శంకరమే అన్నాడు:

"ఆలోచించే జ్ఞానం నాకూ ఉందంటే నమ్ముకుంటారా మాస్టారూ! ఏది మంచో ఏది చెడో తెలుసు. నా సుఖంకోసం, నా భవిష్యత్తుకోసం నేను చేసుకున్న నిర్ణయాలపైన నాకు నమ్మకముంది; ఉంటుంది."

"నా మాటలుకూడా అర్థం చేసుకో శంకరం! సిరిసంపదలతో తులతూగుతున్నవారితో, ఒక రిటైరయిన బడిపంతులు వియ్యమందుకోబోతున్నాడంటే హాస్యాస్పదంగా కనిపిస్తుంది. రాధ నీకు కావాలి. తగినవారితో వియ్యమొందాలని మీ నాన్నగారి అభిప్రాయమై ఉండవచ్చు. ఆ మాటకొస్తే ఆయనలాంటి ప్రతిమనిషికీ అదే అభిప్రాయం ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో మీమధ్య—"

"మీరు చెప్పదలచుకున్నది నాకు తెలుసు మాస్టారూ! అందుకే అంటున్నాను: మా నాన్నచేత ఈ పెళ్ళికి ఒప్పించే పూచీ నాదని. ఇంతకంటే ఇంకేం చెప్పగలను?"

మాస్టారు తల పంకించారు.

"సరే, నీ యిష్టం. చీకటి పడుతోంది యిక ఇంటికి వెడదాం పద నాయనా!"

—మౌనంగా మాస్టార్ని వెంబడించాడు శంకరం. ఇంటికి వచ్చిన తర్వాత మాస్టారు తమ పోర్షనులోకి వెళ్లబోతూ అన్నారు:

"పరీక్షలు దగ్గరపడుతున్నాయి. శ్రద్ధగా చదువుకో!"

తలుపుతీసి గదిలోకి వచ్చాడు శంకరం. లైటు వేశాడు. గదిమధ్యగా ఒక చిన్న చీటి పడి ఉన్నది.. ఆ చీటీని చూడగానే నవ్వుకున్నాడు. "మళ్ళా ఆశాభంగం కలిగించాను కాబోలు ఖర్మం" అనుకున్నాడు.

చీటి విప్పి చదివాడు:

"హలో బావా!

అంతా మామూలే! హాస్టలునుండి వస్తున్నావేమోనని చూచాను; లేవు. వచ్చినట్టు తెలియజేయడం నా ధర్మం గనుక— ఆ సంగతి ఈ కాగితంమీద రాసి కిటికీ ద్వారా అందజేయదలచాను. వచ్చే ఆదివారం మా క్లాసు పిల్లలంతా పిక్నిక్ వేశారు. నువ్వేదైనా ప్రోగ్రాం వేస్తే, ఆ విషయం నాకు తెలియజేస్తే, నీకోసం (నువ్వు కోరావు కాబట్టి) ఆ పిక్నిక్‌కి తిలోదకాలు యిచ్చేస్తాను. పరీక్ష లొస్తున్న సంగతి నీకు తెలుసు. నేను

—45వ పేజీ చూడండి

# మనసు

12—వ పేజీ తరువాయి

చదవడంలేదు. నువ్వు శ్రద్ధగా చదవవలెను—లేవిచో—మామయ్య నీ పని పట్టగలరు. జాగ్రత్త.

—సత్య"

సత్యవతి గుర్తుకొచ్చినప్పుడల్లా, నవ్వురావడం రివాజైపోయింది శంకరానికి. ఆమె రాసిన 'లేఖ' చదువుకుని తనలో తనే నవ్వుకున్నాడు.

బట్టలు మార్చుకుని పుస్తకం తీసుకున్నాడు చదువుకుందికి.

— మాస్టారు మంచికి మరో పేరు. బడిపంతులు చేసి, తను సంపాయించకలిగింది ఈ పాత ఇల్లొకటేను. ట్యూషన్లు చెప్పేవారు—దీనిమూలంగా వచ్చే ఆదాయాన్ని మాత్రం కాదనేవారు.

కాలం గడిచింది. ఇంటి విషయాలన్నీ గుప్పెట్లో దాచి ఉంచిన ఇల్లాలు కన్ను మూసింది. మాస్టారుకి యిప్పుడు మిగిలిఉన్న ఆనందం రాధ! ఆ పిల్లకోసమే మాస్టారు జీవిస్తున్నారు. లేకపోతే 'ఆవిడ' లేని ఈ వెలితి బ్రతుకు ఏవిధంగా ఎందుకు గడపాలో అర్థంకాక యమయాతన అనుభవించేవారేను. ఇప్పటికీ అంటా రాయన—రాధే నా బ్రతుకూ, వెలుగూ—అని.

ఆయ నింట్లోనే 'అద్దె' కుండి, ఆయన దగ్గరే చదువుకుని హైస్కూలు దాటాడు శంకరం. శంకరమంటే మాస్టారికి అమితాభిమానం, వాత్సల్యమూను.

కాలేజీలో ప్రవేశించిన ఈ నాలుగేళ్ళ గూడా మాస్టారి నీడనే, ఆయన చూపించిన మార్గంలోనే నడిచాడు. ప్రయోజకు డయ్యాడని ఈనాడు చెప్పుకుంటే, అందుకు ముఖ్యమైన కారణం మాస్టారు.

ప్రతి నెలా తన కయ్యే ఖర్చు మాస్టారు తనిఖీ చేసేవారు. తనక్కావలసిన పైకాన్ని మాస్టారికే పంపేవారు నాన్న. నాన్న తన కే విషయాన్నయినా చెప్పాలనుకుంటే, అది ముందుగా మాస్టారికే చెప్పేవారు. తన శ్రేయస్సునంతా మాస్టారు చేతుల్లో పెట్టారు నాన్న.

మాస్టారికీ, తనకీ ఉన్న 'పరిచయాన్ని' కేవలం తన చదువూ, తన శ్రేయస్సులకే పరిమితం చెయ్యాలనిపించలేదు శంకరానికి. ఆయనతో బంధుత్వం ఆశించాడు. అది అమూల్య బాంధవ్యంగా పరిణమించాలని శంకరం కోరిక.

రాధ తననుండి దూరం కాకూడదు. రాధతో తనకున్న పరిచయాన్ని, స్నేహాన్ని, చనువుని వృథా కానివ్వకూడదు. రాధ మనసు తనకి బాగా తెలుసు. మంచితనంలో ఆమె తండ్రిని మించింది. తను ఆశించిన గుణగణాలన్నీ రాధలో మూర్తీభవించి ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే—తన బ్రతుక్కి మరో అర్థం 'రాధ.'

వారంరోజుల క్రితం రాధపై తనకున్న అభిప్రాయాన్ని మాస్టారికి చెప్పాడు. అది విని ఆయన కలవరపాటు చెందారు. ఇది ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో ఆయన ఊహించలేకపోతున్నారు.

బీదరికం అనుభవిస్తున్నా, అభిమానానికి ఆయనెప్పుడూ దూరం కాలేదు. ఇన్నేళ్ళూ శంకరంపైన తను చూపించిన ఆదరణా, వాత్సల్యాల వెనుక ఇంత స్వార్థమా? అని ఎవరైనా ముఖం ముందే అనేస్తే? ఈ పేద బడిపంతులి అవిరామమైన కృషివల్ల తయారైన 'వల' పేరు శంకరం అనబడే ఒకానొక బంగారు పిచ్చుక! అని ఎవరైనా గేలిచేస్తే—విని సహిస్తూ బ్రతకడం దుర్లభం!

'రాధకీ నీకూ పెళ్ళేమిటి, నాయనా? ఇది జరగనిది!' అని చెప్పటానికి—ఆ యిద్దరిమధ్యా ఏర్పడిన రాగబంధం తనని అంత మాట అననివ్వలేకపోతుంది.

ఇది మాస్టారి పాలిట ఒక పరీక్ష! ఒక సమస్య.

మరుసటిరోజు ఉదయం.—

రాధ, శంకరం — గది గుమ్మానికి చేరగిలబడి, జడని సవరించుకుంటూ:

'నాన్న నాకంతా చెప్పారు' అన్నది.

"విన్న తమరు ఏమని సెలవిస్తారో తెలియజేస్తే, భవదీయుడు సంతోషిస్తాడు."

"చెప్పనా?"

"తప్పకుండాను."

"మన ...."

"ఊఁ .... మన ...."

"ఇంత త్వరలో పెళ్ళి జరగడం నాకూ, నాన్నకీ ఇష్టంలేదు." జడని వెనక్కి విసరి గోడవైపు చూస్తూ అన్నది.

"ఎందుకనిట?"

"మీ చదువుకి యింతటితోనే స్వస్తి పలకడం భావ్యంకాదు గనుక."

"అలాగా!"

"పెద్ద చదువులు చదివి, ఆఫీసరైతే—ఆపైన ఫలానతను నా శిష్యుడే సుమా అని గర్వంగా నాన్న చెప్పుకునే రోజు రావాలిట. ఆ రోజునే ఆయనకు సరైన గురుదక్షిణ లభించినట్లు భావిస్తారుట."

"సరే .... పెద్ద చదువులకే పోతా ననుకో. ఆ దరిమిలా చదువు పూర్తయ్యేంతవరకూ, ఈ రాధారాణిగారి ఎడబాటు సహించగలనా? అన్నదే ప్రశ్న. మీ జవాబు?"

"అదేం కుదరదు. చదువు పూర్తయిన తర్వాత పెళ్ళి. మీకు నేనూ, నాకు మీరూ కొనాళ్ళపాటు దూరంగా ఉన్నా, మధురంగానే ఉంటుంది కదా! అలాంటి మధురానుభవాలుంటేనే కదా జీవితానికి పరిపూర్ణత—అని నే నంటాను" అని కిలకిలా నవ్వింది రాధ.

వెన్నెల చిందినట్టు నవ్వగలదు రాధ. ఈ నవ్వూ, ఈ రాధే తనకు కావాలి. ఇవే లేకపోతే?—

"శ్రద్ధగా చదువుకొంటున్నారా దొరగారూ?"

"ఆహా .... రాణిగారికోసం ఏ ఘనకార్యమైనా చెయ్యగలను. చెప్పండి: కొండల్ని పిండి చెయ్యమంటారా? ఏడు సముద్రాలూ దాటి ...."

"ఆపండి. అవ్వేమీ చెయ్యక్కర్లేదు గాని, నాన్నగారి కోరిక తీర్చండి; చాలు."

"ఆజ్ఞ."

"మిమ్మల్ని ఆట్టే డిస్టర్బ్ చెయ్యడం తగదు. కాబోలు. చదువుకోండింక. వస్తాను."

"చంపావు రాధా! రోజూ ఈమాత్రమైనా మాటాడకపోతే బోరుకొట్టి చస్తాను. పుణ్యమాయిరి మరోసారి ఇలా అనకు."

రాధ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

తియ్యగా గడిచిన అలాటి రోజులు స్మృతిపథంలో ఎప్పటికీ చెరిగిపోవు!


## శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, వీడిపోయిన భార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ. 2 ఎం.ఒ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సం॥రం జాతకం రూ 2. పూర్తి పేరు, జాబు వ్రాసినచో మెతెలిపినచాలును

**హనుమాన్ జ్యోతిషాలయము,**

10వ లైను, అరండల్ పేట, గుంటూరు-2

**ఋణము పొందండి**

**రు. 250 నుండి రు. 10,000**

స్వంత పూచీలమీద పెళ్ళి, వ్యాపారం, ఇల్లు, కారు, స్కూటర్ వగైరాలకు సులభ నెలసరివాయిదాలపై చెల్లించే పద్ధతిలో ఋణము పొందండి. ప్రాస్పెక్టసుకు ఇంగ్లీషు లేక హిందీలో నేడే వ్రాయండి. ఉచితముగా పంపబడును.

KUBER FINANCE (P) LTD.
(K-56), AMRITSAR-5.




మా సులభ పద్ధతి ద్వారా నేడే ఒక రేడియో కొనండి

తక్కువ ప్రారంభపు చెల్లింపు! తక్కువ వాయిదాలు

ఈ సదవకాశాన్ని ఉపయోగపర్చుకొనండి!

<u>షరతులు:</u>

1. ఈస్కీములో ఒక 6 వాల్వులు, 3 బ్యాండులుగల ఎ.సి. రేడియో లేక ఇతరన మోడలు, ట్రాన్సిస్టర్లు కూడా గలవు. 2. రు. 15/- వంతున 20 నెలసరి వాయిదాలు. ప్రతినెల 10 వ తేదీలోగా చెల్లించవలెను. 3. ఈ స్కీములోని లాభములను పొందుటకు వాయిదాలను సక్రమముగా చెల్లించవలెను. 4. వాయిదా లన్నింటిని పూర్తిగా చెల్లించిన తరువాత మెంబర్లందరికి (ఇదివరకే రేడియో తీసుకొన్నవారు మినహా) వారుకోరుకొన్న రేడియో ఇవ్వబడును. 5. స్కీముయందలి రేడియోలన్నీ పూర్తిగా గ్యారంటీ చేయబడినవి 6 స్కీము అమలులో ఉన్నప్పుడు గాని లేక పూర్తి అయిన తర్వాతగాని మెంబర్లు డబ్బు వాపసు కోరుకొనుటకు వీలు లేదు. డబ్బు వాపసు ఇవ్వబడదు. మెంబర్లకు రేడియోలు మాత్రమే ఇవ్వబడును. ఏమెంబరైన స్కీములోని రేడియో కాకపెద్ద మోడల్సు కోరుకొనేయెడల, వాటికి ధరలలోని వ్యత్యాసాన్ని చెల్లించి పొందవచ్చును పూర్తి వివరములకు:

**మార్స్ రేడియో సేల్స్ & సర్వీస్,**

రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్. ఫోన్: 73340.

—పరీక్ష లొచ్చాయి—వెళ్లాయి. శంకరం బాగా రాశాడు. క్లాసు రావచ్చుననే ధైర్యం కూడా ఉన్నది. ఇదే మాటని మాస్టారుతో చెప్పాడు. రెండు రోజులపాటు అక్కడే గడిపాడు. మూడోనాడు ఇంటికి వెళ్లడానికి పెట్టే — బేడా సర్దుతుండగా, రాధ తన గదిలోకి వచ్చింది. ఆ పిల్ల కళ్లల్లో చూచాయిగా నీళ్లు కనిపించాయి.

"అరె .... ఎందుకు రాధా కన్నీరు ?"

"ఛ .... బలేవారేనే ? నాకు కన్నీరేవిటి ?"

ఆమెవైపు తిన్నగా చూస్తూ అన్నాడు:

"మన పెళ్లిమీద మాస్టారికి నమ్మకంలేదు రాధా ! భగవస్సాక్షిగా చెప్తున్నాను. ఈ జన్మకు పెళ్లంటూ రాసిఉంటే, అది నీతోనే జరగాలి..... మా నాన్న విషయం మాస్టారికి తెలిసుండి కూడా ఎందుకో అనుమానిస్తున్నారు."

"దీంట్లో నాన్న తప్పేమీ లేదు."

"అంటే?"

"మనిషికి మనిషి అంత త్వరగా అర్థంకాలేడు శంకరం ! మనిషనేవాడు ఒక పెద్ద పార్యగ్రంథం. అర్థంచేసుకోడానికి వీలుకానంత క్లిష్టంగా ఉంటుంది."

"నిన్నందుకే అంటాను ఆ తండ్రికి తగిన కూతురవని. నువ్వు యిలాగే అంటున్నావు కాబట్టి ఓ పది రోజుల్లో మీ అందరి శంకలూ తీర్చటానికిగాను స్వయంగా మీ కాబోయే మావఁగారే ఇక్కడికి కొస్తారు. సరేనా ?"

".... .... ...."

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

"ఉహూ .... ఏంలేదు .... మీకు వేళవుతుంది కాబోలు. ఉండండి; నాన్నను పిల్చుకొస్తాను."

రాధవెళ్లిపోయింది. కాసేపటికిమాస్టారువచ్చారు.

"క్షేమంగా వెళ్లిరా నాయనా !"

".... .... ...."

"తెలిసో తెలియకో నిన్నెప్పుడైనా కష్టపెడితే ఈ ముసలి మాస్టార్ని మన్నిస్తావుకదూ !" ఆయన గొంతు గద్గదికమయ్యింది.

"మాస్టారూ !"

"ఏమిటో శంకరం ! ఇన్నేళ్లూ మాలో ఒకడివిగా తిరిగావు. మా మనస్సుల్లో నిలిచిపోయావు. ఆ చనువుకొద్దీ నీ మనసుకి నచ్చని విధంగా నే నెప్పుడైనా ప్రవర్తించి ఉండవచ్చునుగా. కాని,ఒక్కటి మాత్రం నిజం.... నేను నీ శ్రేయోభిలాషిని."

".... .... ...."

"వెళ్లిరా నాయనా .... మాస్టార్ని మరిచిపోకు."

"మీరు చిత్రంగా మాటాడుతున్నా రీవేళ."

ఆయన పేలవంగా నవ్వేశారు.

"మాస్టారి గురించి నీ కింకా తెలియదు బాబూ. వేళవుతుంది .... వేగిరం .... బయలుదేరు మరి ."

—స్టేషనువైపు బండి కదిలింది. మాస్టారు వీధి చివరివరకూ వచ్చి, తిరిగి వెళ్లిపోయారు. చూపు ఆనినంతవరకూ, గుమ్మందగ్గరే నిలబడి చూచింది రాధ.

ప్లాటుఫారంమీద ఎక్కువభాగం విద్యార్థులే కనుపిస్తున్నారు గుంపులు గుంపులుగా. వీడ్కోలు ఒకమూల, ఉత్తరాలు రాయడం మానరాదని ఆంక్షలు ఒకమూల, మరిచిపోనని హామీలు యింకొకవైపు. ప్లాటుఫారమంతా సందడిగా, అందంగా అగుపిస్తోంది.

# మనసు

శంకరానికి తెలిసినవాళ్లెవరో నలుగు రైదుగురు కనిపించి, పలుకరించి, అతని అడ్రసూ వగైరాలు తీసుకుని వెళ్లిపోయారు.

కాస్త దూరంగా శంకరానికి సత్యవతి కనిపించింది.

సత్య మరో అమ్మాయితో నవ్వుతూ మాటాడేస్తోంది, మధ్య మధ్య ఎదుటామెని కుదిపేస్తూ. ఈ చోద్యం చూస్తూ వాళ్లకాస్త అవతలగా నిలబడి ఆనందిస్తున్నారు కొంతమంది విద్యార్థులు. ఇదేమీ గమనించే స్థితిలో లేదు సత్య.

శంకరం ఆమెవైపు నడిచాడు. శంకరాన్ని చూచి పలుకరించింది సత్య.

"నువ్వొస్తున్నట్టు చెప్పలేదే సత్యా !" అన్నాడు శంకరం.

"మరే పాపం ! నువ్వు సర్వకాల సర్వావస్థలందూ రూంలో ఉంటావుగదూ. నాదే తప్పు. పద; మావఁయ్యతో అంతా చెప్పేస్తాను. రూంలో ఉండి, క్షణం కూడా చదవడంలేదని—పై పెచ్చు అబద్ధాలు విరివిగా ఆడేస్తున్నావని."

"ఉహూ .... అలాగేం ?"

"బైదిబై—ఈవిడ ఇందిర. మా క్లాసుమేటు. చాలా చక్కగా పాడుతుంది. ఆమాటకొస్తే వాళ్లింట్లో ఉన్న ప్రతి ఒక్కరూ గొప్ప గాయకశిఖామణులు. అప్పుడప్పుడు రేడియోలో పాల్గొంటారు గూడాను. ఇతను మా బావ. పేరు శంకరం. బియస్సీ ఫైనల్ రాశాడు. మా యిద్దరిదీ ఒకే ఊరు. చదువులో బ్రిలియంటనీ పెద్ద పేరు. ఇంతకంటే చెప్పుకోతగ్గ వివరాలు నాకు కనుపించడంలేదు."

సత్యవతి పరిచయంచేసే పద్ధతి చూచి ఫక్కున నవ్వింది ఇందిర.

"వసపిట్టకీ, సత్యవతికీ చాలా పోలికలున్నాయి. మహా అల్లరి చేస్తుందండీ" అన్నది ఇందిర.

"చదువులో చెప్పారుకాదు" అడిగాడు శంకరం.

"ఆవిడనే అడగండి."

"పోవోస్. నాకు చదువెందు కసలు ? ఆడపిల్లకి చదువుతో పనిలేదన్నారు కొందరు."

"మరి చదవడం దేనికో."

"తోచక; చదివించే నాన్న ముద్దు చెల్లించడానికి. చాలా?"

"చాలు. నీతో మాటాడ్డమంటే బ్రహ్మవిద్య."

సరిగ్గా అదే సమయంలో దూరాన రైలుకూత వినిపించింది. ప్లాటుఫారంమీద కలకలం మిన్నుముట్టింది.

రైలు వచ్చి ఆగింది. శంకరం, సత్యవతీ, ఇందిర దగ్గర సెలవు తీసుకుని రైలెక్కారు.

"అందర్నీ మరీ మరీ అడిగానని చెప్పు ఇందూ! వెళ్లగానే ఉత్తరం రాస్తానుగాని, జవాబులు రాయాలి సుమా ! ఏం .... అశ్రద్ధ జేస్తే మాత్రం నేను సహించేది లేదు. నా సంగతి తెలుసుగా. గుర్తుంచుకో..... "

రైలు కదిలింది. ఊరు విడిచింది!

—ఇంటికొచ్చిన మర్నాడు భోజనాలైన తర్వాత శంకరం నాన్నగారి గదిలోకి వెళ్లాడు. శంకరాన్ని చూచి, చదివే పుస్తకాన్ని మూసి—

"అలా కూర్చో" అన్నారు జానకిరామయ్య.

శంకరం కూర్చున్నాడు.

"మాస్టారు కులాసాయేనా ? ఈమధ్య ఆయన వంట్లో బావుండలేదని తెలిసింది. యిప్పు డెలా ఉందిట ?"

"కులాసాగానే ఉన్నారు."

"పరీక్షలెలా రాశావు ?"


"క్లాసు రావచ్చును."

"సత్య ఎలా రాసిందిట ?"

"నాకు చెప్పలేదు."

"ఉహూ.... నువ్విది పాసయిన తర్వాత ఏమ్మెస్సీ చదివించా లనుకుంటున్నాను."

"మీ యిష్టం."



# మనసు

"వేరే ఏదైనా కోర్సుకి వెళ్లాలని ఉంటే చెప్పు. ఆ ఏర్పాట్లు చేస్తాను .... నీ పెళ్ళి చేసేయాలని మీ అమ్మ తొందర పెడుతోంది. అంగీకారమైతే—" ఆయన చిన్నగా నవ్వుతూ అన్నారు.

"నేను మాస్టారికి మాట యిచ్చాను."

"ఏమని ?" ఆయన ఆశ్చర్యపోతూ అడిగారు.

"నా చదువు పూర్తయ్యేంత వరకూ పెళ్లి చేసుకోనని."

"అలాగే కానివ్వు."

"పెళ్లి చేసుకోడమంటూ జరిగితే, మాస్టారిగా రమ్మాయినే చేసుకుంటానని కూడా చెప్పాను."

జానకిరామయ్యగారు ఉలిక్కిపడ్డారు. కొడుక వైపు తీక్షణంగా చూశారు.

"అంటే ...."

"రాధని ప్రేమించాను."

రెండు క్షణాల వరకూ తండ్రి మాటాడలేక పోయారు. తర్వాత అన్నారు:

"మరిన్నాళ్లనుండి నాకు చెప్పనేలేదేం ?"

"ఇప్పుడు ఆ అవసరం కలిగింది."

"ఏమిటా తిక్క సమాధానం ?"

".... .... ...."

"అన్నీ ఆలోచించే మాట యిచ్చావా ?"

"వీలైనంత త్వరలో మిమ్మల్నికూడా ఈ పెళ్లికి వప్పిస్తానని చెప్పి వచ్చాను."

"పెద్దవాళ్లమంటూ మేముండగా మాతో సంప్రదించకుండానే మాటివ్వడం జరిగిందా శంకరం ! మాకు నువ్విచ్చే గౌరవం యిదేనా ?"

"క్షమించండి. మీరు నా కోరిక నెప్పుడూ కాదనరని నాకు తెలుసు."

".... .... ...."

"చెప్పండి నాన్నా ! నా నిర్ణయం మీకు నచ్చలేదా ?"

"కాదంటే నువ్వు బాధపడటం తప్ప మరేమీ ఉండదుగా శంకరం! మాకు కావలసింది నీ సుఖం.'

"మీరు మాస్టారితో ఒకసారి మాట్లాడి రండి.

జానకిరామయ్యగారు కాసేపటి వరకూ మాటాడలేదు. చివరికి అన్నారు.

"నన్నాలోచించుకోనివ్వు శంకరం."

"సరే .... మీ యిష్టం." —

ఈ సంభాషణ అంతటితో ఆగిపోయింది. మళ్ళా మూడు రోజుల వరకూ తండ్రీ కొడుకుల మధ్య మాటలు లేవు. ఏమి ఆలోచించారని కొడుకూ అడగలేదు; నా నిర్ణయం యిదీ అని తండ్రీ చెప్పలేదు. నాలుగోనాటి సాయంత్రం తనని పిలిచి చెప్పాడాయన—

"నువ్వు ఈ విషయం గురించి ఆలోచించకు శంకరం. ముందు, ఆలోచించవలసినది నీ చదువు; అందుక్కావలసిన ప్రయత్నాలు—చెయ్యి. తతిమా విషయాలు నే చూసుకుంటాను. మాస్టారితో నేనే మాట్లాడి వస్తాను. సరేనా ?"

శంకరం కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది. కృతజ్ఞతా పూర్వకంగా ఆయనవైపు చూశాడు.

మరో వారంరోజుల్లో రిజల్ట్సు వస్తాయనగా జానకిరామయ్యగారు మాస్టారింటికి వెళ్లి వచ్చార. కొడుకుతోబాటు కాలువ ఒడ్డుకు వెళ్లారు.

"మాస్టారితో అన్ని విషయాలూ మాట్లాడాను"

"ఆయనేమన్నారు ?"

"ముందు నీ చదువు పూర్తి కావాలని ఆయనంటున్నారు." ఆ తర్వాత తమకుటుంబ విషయాలేవో మాటాడారు."

—శంకరం ఫస్టు — క్లాసులో పాసయ్యాడు. ఆ మర్నాడే విశాఖపట్నం వెళ్లిపోయాడు. అక్కడ బంధువులింట్లో ఉండి సీటుకోసం ప్రయత్నాలు చేశాడు. సీటు దొరికింది. శ్రద్ధగా చదవడం ప్రారంభించాడు.

* * *

"ఏమిటి ఆలోచిస్తున్నారు ?" నీరసంగా అడిగింది రాధ.

"గతం."

ఆమె పేలవంగా నవ్వింది.

"మన కథ చాలా చిత్రంగా నడిచింది రాధా ! మూడేళ్ల క్రితం సన్నివేశాన్ని గుర్తు చేసుకుంటూంటే అంతా తమాషాగా, ఆశ్చర్యంగా అనిపిస్తోంది. మన ప్రమేయం లేకుండానే జరక్కూడనివన్నీ జరిగిపోయాయి కదూ."

"నాకోసం మీరు బాగా శ్రమ తీసుకుంటున్నారు."

"ఇది నా విధి."

"దురదృష్టం పగబట్టిన పాములా నన్ను వెంబడిస్తోంది శంకరం ! .... చావు నా కోసం చేతులు చాచుకూర్చున్నదని నాకు తెలుసు...."

"రాధా .... ఏమిటా మాటలు."

"ఎప్పుడైనా—ఇలా జరుగుతుందని అనుకున్నావా ?" కళ్లనిండా నీరు నింపుకుంది.

"ఇక మాట్లాడకు రాధా .... నీకు విశ్రాంతి అవసరం."

శంకరంవైపు పిచ్చిగా చూడటం మొదలు పెట్టింది రాధ.

"ఈ మందు తాగి నిద్రపో .... ఇలాటి రోగాలి నెన్నిటినో బాగుచేస్తున్నారు ఈమధ్య. ధైర్యంగా ఉండు." అతను రాధచేత మందు తాగించాడు. మెల్లగా అక్కడనుంచి లేచి బయటి కొచ్చాడు. అప్పుడే మాస్టారు యింట్లోకి వస్తున్నారు. శంకరాన్ని చూచి మళ్ళా తల వంచుకుని, రాధ గదిలోకి వెళ్లిపోయారు.

శంకరం నిట్టూర్చాడు !

పాపం మాస్టారు కూడా చిక్కి శల్యమై పోయారు. ఆనాటి కళాకాంతులు ఆయనలో మచ్చుకైనా కనిపించడంలేదు.

వీధి అరుగుమీద కూర్చుని సిగరెట్టు ముట్టించాడు శంకరం. మళ్ళా గతం కళ్లముందు తిరగడం ప్రారంభించింది.

(సశేషం)





# మం[illegible]

## ఆదివిష్ణు

(గత సంచిక తరువాయి)

విశాఖనుండి యింటి కొస్తూండగా—రాధనీ, మాస్టార్నీ చూడాలనిపించి ఆ ఊళ్లో దిగాడు. మాస్టారింటికి వెళ్లాడు. ఆ యింటి తలుపులు మూసి ఉన్నాయి. లోపలనుండి సన్నగా మూలుగూ, దగ్గూ వినిపిస్తున్నాయి.

"మాస్టారూ!" తలుపు తట్టి పిలిచాడు. మొదటి పిలుపుకి సమాధానం రాకపోవడంతో, మరో మాటు గట్టిగా పిలిచాడు.

"లోపలికి రండి" మాస్టారు నెమ్మదిగా అన్నారు.

మంచంమీద అంటిపెట్టుకునున్న మాస్టార్ని చూడగానే శంకరం ఉలిక్కిపడ్డాడు. గబగబా ఆయన—దగ్గరికెళ్లి అడిగాడు.

"జ్వరమా, మాస్టారూ?"

శంకరాన్ని చూడగానే ఆయన ఆశ్చర్యపోయాడు. తర్వాత మూలుగుతూనే! అన్నారు:

"అవున్నాయనా ?"

"నాకు ఉత్తరం రాయలేదే ? నా ఉత్తరాలకి ఒకదానికూడా జవాబివ్వలేదేమండి ?"

"బాగా చదువుతున్నావా ? యూనివర్శిటీ వాతావరణం ఎలా ఉంది నాయనా ?"

"రాధ కనిపించడం లేదేమండి ?

ఆ మాట విని, తన తల పక్కకు తిప్పుకుని అన్నారు:

"వెళ్లిపోయింది."

"ఎక్కడికి ?"

"అత్తవారింటికి. ఆడపిల్లకదు నాయనా ! వాళ్ల గమ్యస్థానం అదే మరి."

"మాస్టారూ." ఆయన ధోరణి మొదట అర్థం కాలేదు శంకరానికి.

"అవున్నాయనా .... రాధ కాపురం చేస్తోంది ... నువ్వు .... రాధ కోసమే వస్తే వెళ్లిపో ...."

శంకరం అచేతనుడై పోయాడు. కాసేపటి వరకూ ఏమీ మాటాడలేకపోయాడు.

"ఇలా ఎందుకు జరిగింది ?"

"విధి నాయనా !"

"కాదు; మోసం; పచ్చి మోసం. మీరంతా ..."

"నిన్ను చూస్తూంటే జాలిగా ఉంది. చాలా ఊహించుకుని .... యిప్పుడు ...."

"రాధ ఈ పెళ్లికి ఒప్పుకుందా మాస్టారు ?"

"ఏం చేస్తుంది .... నామాట కాదనేందుకు అధికారం ఆ పిల్లకు లేదు....."

"ఈ మాట మీ రెలా అనగలుగుతున్నారు ?"

"నన్ను విసిగించకు శంకరం ! ప్రశ్నించటానికి నీకే అధికారమూ లేదు ... రాధ—పెళ్లి విషయం మరచిపో .... ఇంకేదైనా మాటాడాలని ఉంటే మాటాడు. లేదు .... వెళ్లిపో ...."

శంకరం ఆ ఇంటి నుండి వచ్చేశాడు ఆ రాత్రి బండికే యింటికి బయలుదేరాడు. ఇంటికొచ్చిన తర్వాత నాన్నతో ఈ విషయం చెప్పాడు...

"నాకూ మొన్ననే తెలిసింది శంకరం! బహుశా .... మాస్టారికి నిన్ను అల్లునిగా స్వీకరించటానికి ఇష్టంలేదు కాబోలు. ఆనాడుకూడా అదే ధోరణిలో చెప్పారు. అది నీకు చెపితే నువ్వెక్కడ బాధపడతావోనని చెప్పలేదు."

రోజులు మాసాల్లో పడ్డాయి. యూనివర్శిటీ తెరిచి నెల గడిచింది. తండ్రి ఎంత తొందర చేసినా, విశాఖపట్నం వెళ్లలేదు శంకరం. చివరికి తేల్చి చెప్పాడు: "చదువు మానుకున్నానని" ఆ మాటతో జానకిరామయ్యగారు డీలా పడిపోయాడు.

అయిపోయింది; అంతా అయిపోయింది. నూటిగా పోవలసిన శంకరం జీవితం—ఒక కొత్త మలుపు తిరిగింది. అది ఎలాటి పరిణామాలకు దారి తీస్తుందోనని జానకిరామయ్యగారు భయపడుతూనే ఉన్నారు.

రోజు రోజుకీ కొడుకులో కనుపిస్తూన్న మార్పులకి తల్లడిల్లిపోయారాయన. దిగులు పెంచుకుంటున్నారు. ఇక ఆ తల్లి విషయం చెప్పనక్కర్లేదు.

శంకరం ఎవరితోనూ మాటాడడు. ఏదీ పట్టించుకోడు. కొడుకు దుస్థితి చూసి ఆ తల్లి

—33వ పేజీ చూడండి

# మనసు

22 వ పేజీ తరువాయి

దుఃఖించని రోజు లేదు. దాని మూలంగా ఆవిడకి ఫిట్సు రావడం కూడా అలవాటైపోయింది.

జానకిరామయ్యగారు ఒకరోజున కొడుకుని ముందు పెట్టుకుని ఇలా అన్నారు—"నువ్వే మాకు సర్వస్వం. నీ సుఖమే మాకు కావలసింది. ఒక ఆడపిల్లకోసం నీ సర్వసౌఖ్యాలూ పాడుచేసుకోడం భావ్యమా నాయనా ? చెప్పు ! ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు.—ఆ రాధ కాకపోతే మరొకళ్లు.. క్షణంలో నీ కాళ్లముందు నించుంటారు. 'చదువనంటావా .... అలాగే చెయ్యి. నువ్వు చదివి సంపాయించవలసిన అవసరం మనకి లేనేలేదు. కాని .... మాముందు నువ్వు మునుపటి శంకరంలా తిరుగు నాయనా .... మాకు వ్యథ కలిగించకు...."

ఆయన కే జవాబూ చెప్పకుండానే కాలువ ఒడుకి వెళ్ళిపోయాడు శంకరం. ఒడ్డున కూర్చుని కాలువలో రాళ్లు రువ్వుతూ నాలుగు రోజుల క్రితం తన డైరీలో రాసుకున్నదంతా గుర్తు చేసుకోడం ప్రారంభించాడు:

"ఇంటినీ, అమ్మనీ, నాన్ననీ, అందర్నీ వదిలి కొన్నాళ్లపాటు ఎక్కడికైనా వెళ్ళిపోవాలని ఉంది. చెప్పద్దూ .... నన్ను చూస్తుంటే నాకే జాలి కలుగుతుంది. పాపం .... చివరి కిలా తయారవుతానని కలలోనైనా తలచానా ?"

శంకరం తనలో తనే పిచ్చిగా నవ్వుకున్నాడు. ఇలా కొన్నాళ్లు జరుగుతే పిచ్చివాడై పోగలడేమో... ఏమో ......

"బావా ...." తన వెనక నిలబడి సత్య పిలిచింది.

ఉలిక్కిపడి, తిరిగి చూశాడు. సత్య పక్కన మరో యువకుడు నిలబడి ఉన్నాడు.

"జరిగినదంతా విన్నాను బావా !...."

శంకరం కాలువ ఒడ్డునున్న పిచ్చి—మొక్కల్ని అతి జాగ్రత్తగా తుంచడం మొదలుపెట్టాడు.

"నీ చదువు ...."

సత్య—మాటకి అడ్డు తగిలి:

"మానుకున్నాను సత్యా! చదవ బుద్ధి పుట్టడం లేదు. అయినా చదివి ఏం వెలగ వెబెట్టాలి గనుక? నాలుగు తరాల వరకూ తరగని ఆస్తి ఉంది కదూ. నిక్షేపంగా బ్రతుకవచ్చు. నా కేం భయం ? చెప్పు సత్యా !" కాలువలోకి చూస్తూ అన్నాడు.

"కానీ .... ఈ ఆస్తితో మనశ్శాంతిని మాత్రం కొనుక్కోలేను. అదొక్కటే దిగులు సత్యా !"

"బావా !"

"చిత్రమైన వ్యథ కదూ."

సత్యవతి కన్నీరు పెట్టుకున్నట్టు చూచాడు.

"క్షమించు. ఎప్పుడూ నవ్వుతూ తిరిగే నిన్ను ఏడిపించడం ధర్మంకాదు. వస్తా ...." శంకరం లేవబోయాడు.

"కూర్చో బావా ! నీతో మాటాడాలి" అంటూ తను కూర్చుని, తన పక్కనున్న వ్యక్తిని కూడా కూర్చోమని సైగ చేసింది. అతనూ కూర్చున్నాడు. క్షణాలు గడిచాయి. ముగ్గుర్లో ఎవ్వరూ మాటాడలేదు.

"ఏదో మాటాడాలన్నావ్" శంకరం అడిగాడు.

"ఇతను మూర్తి; స్నేహితుడు. ఆనాడు స్టేషన్లో ఇందిరని ఒకమ్మాయిని పరిచయం చేశాను; చూడూ! ఆవిడ—అన్నగారు. ఈయన మా బావ శంకరం."

"చదువులో బ్రిలియంటని అందరూ చెప్పుకుంటారు. ఫస్టుక్లాసు వస్తుందనుకుంటున్నాం— అంతటితోనే ఆగిపోయావే ? నాకున్న అర్హతలన్నీ చెప్పు మరి" అన్నాడు శంకరం నవ్వుతూ.

"నీతో ఒక ముఖ్యమైన పనుండి వచ్చాము బావా ?"

"చెప్పమన్నానుకదూ."

"మూర్తీ, నేనూ పెళ్లి చేసుకోబోతున్నాం."

ఆ మాట విని శంకరం ఆనందించాడు.

"కంగ్రాచ్యులేషన్స్. ఇంతవరకూ ఇంత చక్కటి వార్త దాచిపెట్టినందుకు తగిన శిక్ష మీవారే నిర్ణయిస్తారు."

"కానీ .... బావా !"

"మధ్య 'కానీ' ఎందుకు ?"

".... .... ...."

"మీరైనా చెప్పండి మూర్తీ !"

"ఎలా చెప్పాలో తెలీకుండా ఉన్నది" అన్నాడు మూర్తి.

"ఇదేమిటి ? అంత చెప్పరాని విషయమా ? శంకించట మెందుకు ? చెప్పండి."

"మీ కథ విన్న తర్వాత ఎవడైనా జాలి చూపెడతాడు. అలాంటి మీనుండి మరొక సహాయాన్ని అర్థించటానికి వచ్చాము..... సత్యవతిని మీకిచ్చి పెళ్లి చేయాలని మీవాళ్లంతా నిశ్చయించుకున్నారట."

శంకరం అదిరిపడ్డాడు. ఇద్దరివైపూ ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు:

"నాకు నవ్వాలో, ఏడవాలో తెలీడంలేదు. సత్యతో నాకు పెళ్లా .... మన మెప్పుడైనా ఈమాట అనుకున్నామా సత్యా ! మా పెద్దలొస్తూ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పండి మూర్తీ !— నే నెప్పుడూ సత్యని ఆ భావంతో చూడలేదనీ, ఇకముందు చూడబోననీను. వెళ్లండి. మావయ్యతో ముఖాముఖి మాట్లాడండి. సత్యని ప్రేమించినట్టు చెప్పండి. మీ పెళ్లి జరగటానికి ఆయన కిష్టం లేకపోతే ఉండనే ఉంది గాంధర్వ వివాహం !"

"బావా ! నువ్వు దేవుడివి."

"పిచ్చిపిల్లా .... మని షెప్పుడూ దేవుడు కాలేడు. అలా అనుకుంటే దేవుణ్ణి కించపరిచిన ట్లవుతుంది. చూడమ్మా, ఇలాంటి విషయాల్లో జాప్యం పనికి రాదు. .... నువ్వు నీకు నచ్చిన వ్యక్తిని ప్రేమించి, మనసిచ్చినట్టు నా కింతవరకూ తెలీదు. అమాయకంగా అగుపిస్తూ, పసిపిల్లలా అల్లరిచేసే నువ్వు ఒక వ్యక్తికి మనసిచ్చావని తెలిసిన తర్వాత ఆశ్చర్య పోతున్నాను. అదృష్టవంతురాలివమ్మా !"

"మీ గురించి సత్య చాలా చెప్పింది. ఇప్పుడు ప్రత్యక్షంగా మీ సహృదయత్వాన్ని అర్థంచేసుకుంటున్నాను" అన్నాడు మూర్తి.

శంకరం అతని భుజం తట్టి—

"చూడు మిస్టర్ ! సత్య చిన్నపిల్ల. నవ్వడం ఒక్కటే చాతనవును. ఆపిల్లని పువ్వుల్లో పెట్టి పోషించడం నీ బాధ్యత. చిన్న పొరపాట్లు సర్దుకుపోవాలి. ఓర్పూ, సహనం కావాలి. .... ఇప్పుడే వెళ్లండి. మావయ్యతో అంతా చెప్పండి. అవసరమైతే ఈ విషయంలో నా చాతనైన సహాయం తప్పకుండా ఉంటుంది."

".... .... ...."

"మీ పెళ్లి చూచి—తీర్థయాత్రలకు వెళ్లాలని ఉంది."


**ఋణము పొందండి**

**రు. 250 నుండి రు. 10,000**

స్వంత పూచీ మీద పెళ్ళి, వ్యాపారం, ఇల్లు, కారు, స్కూటర్ వగైరాలకు సులభ నెలసరివాయిదాలపై చెల్లించే పద్ధతిలో ఋణము పొందండి. ప్రాస్పెక్టసుకు ఇంగ్లీషు లేక హిందీలో నేడే వ్రాయండి. ఉచితముగా పంపబడును.

KUBER FINANCE (P) LTD.
(K-56), AMRITSAR-5.

**తెల్ల వెంట్రుకలు వుండవు**

గొప్ప శక్తివంతమైనదియు, మెదడుకే ఓడ్ అసాధారణమైన సెంటుతో గూడిన మాయొక్క ఆయుర్వేదిక్ "గ్రే హేర్ ఆయిల్" వెంట్రుకలు తెల్లరంగుగా మారుచుండుటను ఖండించి, పూర్తిగా నల్లని రంగుగా మార్చగలదు. అది మెదడుకు కంటిచూపునకు టానిక్కుగా పని చేయును. ఖరీదు రూ. 6/– దానికంటే ఎక్కువ పరిమాణమైనది. రూ. 8/-

Viswa Kalyan Aushadhalaya (A),
P.O. Katri Sarai (Gaya)

పండిత
డి. గోపాలాచార్యులవారి
**అరుణ**
స్త్రీల ఆరోగ్యసౌభాగ్యాలకు
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు-17

**20 రోజులకు మాత్రము**



తగ్గింపు ధరలు. కాశ్మీర్ బ్యూటి చేనేత చీరలు. ఒక్కొక్కటి ధర రు 7/50. 2 చీరలు రు 14. 3 చీరలు రు. 20. ఒకే తడవ 3 చీరలు కొనువారికి పోస్టేజి, ప్యాకింగు ఉచితం.

బహుమతులు :– 2 చీరలు కొనువారికి ఒక జత ఇయర్ టాప్స్. 3 చీరలు కొనువారికి ఒక బ్లవుస్, ఒక జత ఇయర్ టాప్స్. మీ ఆర్డరును వెంటనే పంపండి. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

THE ROYAL STORES (APM)
Post Box No. 1774, Delhi-6.

"తీర్థయాత్రలా!" ఆశ్చర్యంగా అడిగింది సత్య.

"అవును. ఈ వయస్సులో ఆ కోరిక కలగడం తప్పులాటగా ఉండచ్చు. అయినా వెళ్ళాలి."

"మళ్ళీ ఎప్పుడు వస్తావు."

"తెలియదు. అందుకే అంటున్నాను—మీ పెళ్ళి చూచే వెడతానని. లేవండి; చీకటి పడుతోంది."

అంతే—

మరో నెల—రోజుల్లో మూర్తికీ, సత్యవతికీ నిర్విఘ్నంగా పెళ్ళి జరిగింది. ఇద్దరూ శంకరానికి కృతజ్ఞత చెప్పుకున్నారు.

# మనసు

పెళ్ళి—పనులన్నీ సద్దుమణిగిన తర్వాత శంకరం తీర్థయాత్రలకు బయలుదేరాడు. తల్లీ, తండ్రీ ఎంత చెప్పినా వినలేదు. వాళ్ళూ వస్తామని ఒడి గారు. వసేమిరా, ఒంటరిగానే వెళ్ళాలని నిష్కర్షగా చెప్పాడు.

తెల్లవారుఝామున ప్రయాణమనగా ఆ రాత్రి—జానకిరామయ్యగారు కొడుకు రెండు చేతులూ పట్టుకుని, కన్నీటితో అన్నారు:

"నన్ను క్షమించు నాయనా!"

శంకరం అదిరిపడ్డాడు!

"ఇంత దారుణమైన పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని తెలుస్తే నేనా పాడుపని చేసే వాడిని కాదు. దానికి తగ్గ ప్రాయశ్చిత్తం అనుభవిస్తున్నాను. సత్యని నీ భార్యగా చేయాలనే కుతూహలంతో, చేజేతులా నీ బ్రతుకుని పాడుచేశాను. మాష్టార్ని అనరాని మాటలు అన్నాను. పాపం! కిమ్మనలే దాయన. నేను చెప్పినట్టే చేశారు. నీకు




సన్‌లైట్ ఉత్తమ నురగనిచ్చే శుద్ధమైన సబ్బు

హిందూస్థాన్ లీవర్ లిమిటెడ్ S. 33-X52 TL

తెలీకుండానే రాధ పెళ్లి చేశాడు .... ఈ పాపానికి శిక్ష అనుభవించాలి; తప్పదు. నువ్వు నా కళ్ల ముందు లేకపోతే బ్రతకను. నీ మనసు పాడు చేసుకుని దేశాలు తిరుగుతూంటే చూచి సహించ లేను నాయనా !''

శంకరం ఆశ్చర్యపోయాడు. తన దుస్థితికి కారణం పెంచి పెద్దజేసిన తండ్రి అని తెలియగానే, అతనిలో దుఃఖం పెల్లుబికింది. చిన్న పిల్లాడిలా, వలవలా ఏడిచేశాడు.

—ఇదంతా జరిగి మూడేళ్లకు పైగా అయింది. ఈ మధ్యకాలంలో రాధ—సంసారం గురించి వివరాలు బొత్తిగా తెలియలేదు. ఈ మూడేళ్ళూ ఇష్టంవచ్చినట్లు తిరిగాడు. తన పిచ్చి గాని—ఈ యాత్రల్లో, మజిలీలలో శాంతి ఎక్కడ దొరుకుతుంది? అదేమైనా చేతికి దొరికే వస్తువా? —కాదాయె.

విసుగుపుట్టి యింటికి తిరిగొస్తూండగా, రాజమండ్రి స్టేషన్లో—అర్ధరాత్రి—మాస్టార్నీ, రాధనీ చూశాడు. వాళ్లిద్దరి వాలకం చూసి గాబరా పడిపోయాడు. గబగబా రైలు దిగి, వాళ్లను చేరుకున్నాడు.

రాధ—సంసారం గురించి మాస్టారు చెప్పింది వింటూంటే తల తిరిగినంత పనయింది రాధ లేకతనెంత క్షోభ పడుతున్నాడో, పెళ్లయి అంతకి వెయ్యి రెట్లు క్షోభని అనుభవిస్తోందిట రాధ.

అతను తాగుబోతు—జూదరి. రాధ వంటిమీది నగలూ, ఇంటిదగ్గర రాధ కోసం మాస్టారు దాచిన డబ్బూ—మొత్తం అతని వ్యసనాలకు వినియోగించాడుట. అక్కడికీ తృప్తి తీరలేదు. డబ్బు దొరికేందుకు వేరే మార్గం కనుపించలేదు. వ్యసనాలు వత్తిడి చేస్తున్నాయి.

ఆఫీసులో దొంగతనం చేశాడు. పట్టుబడ్డాడు. జైలుకి వెళ్లాడు. రాధని అతి దారుణమైన స్థితిలో పుట్టింటికి పంపుతున్నాడు.

రాధ ఈ మూడేళ్ళూ నరకం అనుభవించింది. అనారోగ్యానికి గురైంది. మళ్లీ మాస్టార్ని ఆశ్రయించింది.

మాస్టారికి యిప్పుడు రాధని పోషించే స్థితి లేదు. మిగిలిన యిల్లు కాస్తా రేపో మాపో వేలం వేయబడుతోంది. ఆయన కూడా మానసికంగానూ, శారీరకంగానూ కృశించిపోయారు.

ఈ కథంతా విని శంకరం కన్నీరు పెట్టుకున్నాడు.

“నా మాట కాదనకండి మాస్టారూ .... నా చేతనైనంతవరకూ మీకు సహాయం చేస్తాను. రాధ జబ్బు నయమై మళ్లా మునుపటి మనిషిలా తయారవ్వాలి అందుకు ఎంత డబ్బయినా సరే ... వెచ్చిస్తాను .. అప్పటిగ్గాని నాకు మనశ్శాంతి ఉండదు. మా నాన్న చేసిన తప్పిదానికి ప్రాయశ్చిత్తం లభించాలంటే, నన్నీ సహాయాన్ని చేయనివ్వండి. కాదనకండి మాస్టారూ.''

ఆయన శంకరం భుజాన్ని లాలనగా తట్టారు. తనపైన ఆయనకి మునుపటి వాత్సల్యం మాయం కాలేదు.

*　　*　　*

గదిలోనుండి మాస్టారు శంకరాన్ని ఆత్రంగా పిలిచారు. దాని వెంటనే మాస్టారి ఏడుపు కూడా వినవచ్చింది. ఏనాడూ ఏడవని మాస్టారు ఇప్పుడు ఏడుస్తున్నారు.

శంకరానికి భయంవేసింది. గదిలోకి పరుగెత్తాడు. రాధని చూచి గట్టిగా, పిచ్చిగా అరిచాడు.

“నువ్వు బ్రతకాలి రాధా ! నువ్వు లేకపోతే నే నుండను. నాకోసం బ్రతుకు రాధా ! మాస్టారూ .... డాక్టర్ని పిలవండి. అవసరమైతే దేశంలో ఉన్న వైద్యుల నందర్నీ కొనేసెయ్యండి. నా రాధ బ్రతకాలి మాస్టారూ .... వెళ్లండి ఇంకా చూస్తూ అలా నిలబడ్డారేం ? మీక్కాదూ చెప్తూంట.... వెళ్లండి.''

శంకరం యిక మాటాడలేకపోయాడు.; అలాగే రాధమీద వాలిపోయాడు. మాస్టారు నించున్న చోటనే కుప్పలా కూలిపోయారు.

★

---

# జంతువులు ఆలోచించగలవా?

21—వ పేజీ తరువాయి

కొందరు వార్తాపత్రికలవారు కాని అదేమీ కాదు. కళ ఏవిధంగా పరిణామం చెందినదీ దానివల్ల తెలుస్తుంది ..... ఇది అసలు ఒక అతి ముఖ్యమయిన శాస్త్ర పరిశోధన.... ''

పోనీ తమాషా అనుకున్నా కోతులదే పైచెయ్యి అని తేలింది. ఒక శిశు మనశ్శాస్త్రవేత్తకి ఒక బొమ్మను చూపించారు కోతి వేసింది అని చెప్పకుండా.

ఆయన ఏమన్నాడు ? “షిజాయిడ్ టైప్ (Schizoid type)కి చెందిన అతి వివేకవతి అయిన ఒక పది సంవత్సరాల అమ్మాయి వేసిన చిత్రం ఇది'' అన్నాడు.

కుక్కల పక్షంవారూ లేకపోలేదు. లండన్ జూలో 'మామాల్ హవుస్' (Mammal House) క్యూరేటర్ అయిన డెస్మండ్ మారిస్ అభిప్రాయం కుక్క తోక ఆడించటంలో ఒక భాష యిమిడి ఉందని తోక ఏ కోణంలో ఉంటే ఆ భావాని సూచిస్తుందని ఈయన ఊహిస్తున్నాడు.

కుక్కల కథలు ఎన్ని లేవు ! న్యూకేసిల్—ఆన్—టయిన్‌లో ఒక కుక్క ప్రతివారం ఒకరోజున ఒక రైలు ఎక్కి సరిగా నాలుగు స్టేషన్‌ల అవతల దిగి తన మిత్రులను చూసి తిరిగి రైలుబండిలోనే వచ్చేసేది !

ఇంతేకాదు. సాధారణమయిన ఇంద్రియ జ్ఞానానికి సంబంధించిన విషయాలు మాత్రమే కాక ఒక విధమయిన 'దివ్యదృష్టి' ఏదయినా వాటికి ఉందేమోనని డ్యూక్ యూనివర్సిటీ (అమెరికాలోని ఉత్తర కారొలినా రాష్ట్రంలోనిది)లో కొన్ని పరిశోధనలు జరిపారు.

ఉన్నట్లే అని వారు అంటున్నారు. జంతువులన్నిటికీ ఈ దృష్టి ఉంటే నాగరికతవల్ల 'చెడిపోని' వాటిలో ఇది ఇంకా శక్తివంతంగా ఉంటుందేమో !

స్విస్ ఆల్ప్స్ పర్వతాలలో ఒకటి రెండు సంవత్సరాల క్రితం, ఒక చిన్న బృందం ప్రయాణం చేస్తున్నది అప్పుడు పెద్ద మంచు తుఫాను వీస్తున్నది. ఆ బృందంలో బెడ్‌ఫోర్డ్ డ్యూక్, ఒక అమెరికన్ సినిమా నటి, ఇద్దరు సినిమా వ్యక్తులు ఉన్నారు. మంచులో దారి తెలియక ఒక పెద్ద అగాధంవైపుకి నడిచి వెడుతున్నారు సరిగ్గా అయిదు గజాల దూరం ఉందనగా వారి గాడిద ఆగిపోయింది. ఎంత చెప్పినా కదలలేదు.

“దానివల్లనే మా ప్రాణాలు దక్కాయి'' అన్నాడు డ్యూక్.

బాబీ అనే ఒక అమెరికన్ కుక్క, చలికాలంలో 3,000 మైళ్ల అవతల నున్న తన యింటికి నడిచి వెళ్లగలిగింది. స్టువార్ట్ స్టార్ అనే నావకి చెందిన ఒక పిల్లి ప్రమాద వశాత్తు ఆ నావ బయుదేరేముందు గట్టుమీద ఉండిపోవటంవల్ల సిడ్నీ రేవులోనే ఉండిపోయినా, మరొక నావ ఎక్కి లండన్ చేరుకుంది—ఎనిమిది వారాల తర్వాత.

డెవన్‌లో లైన్‌మత్ అనే చోట 1952 లో ఒక పెద్ద వరద వచ్చింది ఈ వరద రావటానికి రెండుగంట లున్నదనగా అక్కడి గుర్రాలు భయంతో సకిలించటం మొదలు పెట్టాయి, కుక్కలు ఏడిచాయి, కుందేళ్ళు వాటి కలుగుల వదిలి వచ్చాయి, ఒక పిల్లికి అకాలంగా ప్రసవం అయింది.

అన్నిటికన్నా విచిత్రం అయిన సంఘటన ఒకటి ఉన్నది. ఇది వివేకానికి సంబంధించినది కానేకాదు. జంతువులు ఎప్పుడూ మానవులతోనే కాలం గడుపుతూ ఉంటే కొంతకాలం తర్వాత తామూ మానవజాతికి చెందినవే అనుకుంటాయని డెస్మండ్ మారిస్ అంటాడు.

లండన్ జూలో 'సుసీ' అనే ఒక ఆడపులి ఉంది. చాలా అందంగా ఉంటుంది.

**పక్క పంజరంలోకి ఒకనాడు 'సాహిబ్' అనే మొగపులి కొత్తగా వచ్చింది కాని సుసీ ఎప్పుడూ సాహిబ్‌ని చూస్తే చీదరించుకునేది**

**స్త్రీలు పులులతో మాట్లాడుతారా ?**

★